ఆస్పత్రిలో బెడ్స్ **300**

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ నిధులు రూ. **29.7** కోట్లు

అదనంగా సమకూరిన బెడ్స్ **80**

పీజీలో పెరిగిన సీట్లు **17** నుంచి **27**

అందుబాటులోకి వచ్చిన హాస్టల్ వసతి **60** మందికి

అందుబాటులోకి వచ్చిన సేవలు ఈ- హాస్పిటల్, ఈ- ఫార్మా, టెలి మానస్

మానసిక రోగులకు మరింత సాంత్వన



నాడు

ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సాధారణ వసతులకే పరిమితమైంది. ఆస్పత్రిలో అంబులెన్స్ ఉన్నా నిరుపయోగంగా ఉండేది. మందుల కోసం రోగులు చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చేది. ప్రత్యేక భవనాలు గానీ, ఆధునిక సదుపాయాలు గానీ ఏమీ లేవు.



నేడు

ఆస్పత్రి నేడు అనూహ్య రీతిలో అభివృద్ధి చెందింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ మంజూరుతో నూతనంగా చిన్నారుల, వృద్ధుల మానసిక చికిత్స కేంద్రం ఏర్పాటైంది. రోగులకు సత్వరం మందులు అందించే విధంగా ఈ-ఔషధి ఏర్పాటు చేశారు. వ్యసన విముక్తికి పూర్తిస్థాయిలో కేంద్రం నిర్మించారు. నూతనంగా మూడు కోర్సుల నిర్వహణకు అనుమతి లభించింది. పీజీ సీట్లు 17 నుంచి 27కి పెరిగాయి. వార్డుల్లో టీవీలు, మౌలికసదుపాయాలు సమకూరాయి. ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు లభించింది. 26 మంది వైద్యుల పర్యవేక్షణలో 75 మంది నర్సింగ్ సిబ్బంది అందిస్తున్న సేవలు రోగులకు సాంత్వన చేకూరుస్తున్నాయి.

- మనోధైర్యం నింపేలా సేవలు
- ఇంటిని మరపించే వాతావరణం
- మానసిక వ్యాధిగ్రస్తులకు ఉపశమనం



వ్యసన విముక్త కేంద్రం



పునరావాస కేంద్రం

ఏయూ క్యాంపస్: మానసిక సమస్యతో సతమతమయ్యే వారికి సాంత్వన అందిస్తూ.. ఆహ్లాదకర వాతావరణంలో చికిత్సనందిస్తూ ఆరోగ్యప్రదాయినిగా నిలుస్తోంది ప్రభుత్వ మానసిక ఆస్పత్రి. సమాజంలో కలవలేక ఇబ్బంది పడేవారికి అవసరమైన చికిత్సను అందించి, సాధారణ స్థితికి తీసుకు వచ్చేలా సేవలు అందిస్తోంది. ఆరోగ్య సమాజాన్ని నిర్మించే బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తోంది.

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ హోదా

ఆస్పత్రికి సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ గుర్తింపు లభించింది. దీనిలో భాగంగా మంజూరైన 29.7కోట్ల వ్యయంతో నూతన మౌలిక వసతులు సమకూరాయి. ఒక అదనపు అకడమిక్ బ్లాక్‌తో పాటు చైల్డ్ సైక్రియార్టీ, వృద్ధుల మానసిక సమస్యలు, వ్యసన విముక్తి కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. వీటితో పాటు పీజీ కోర్సు చేసే వారికి వసతి కల్పిస్తూ 60 మంది ఉండే విధంగా నూతనంగా హాస్టల్ నిర్మించారు. ఈ వసతులన్నీ త్వరలో ప్రారంభం కానున్నాయి. వీటికి అవసరమైన ఫర్నిచర్ ఇతర మౌలిక వసతులకు కొనుగోలుకు టెండర్లు పిలిచారు. ప్రస్తుతం ఉన్న 300 బెడ్ల ఆస్పత్రికి అదనంగా సీవోఈలో మంజూరైన 80 బెడ్లను చైల్డ్ సైక్రియాట్రీకి 20, వృద్ధుల మానసిక సమస్యలకు 20, వ్యసన విముక్తి కేంద్రానికి 40 వినియోగిస్తారు.

27 మంది వైద్యులతో సేవలు

ప్రస్తుతం మానసిక చికిత్స కేంద్రంలో 27 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. త్వరలో మరొక 10 మంది వైద్యులను నియమించనున్నారు. 75 మంది వరకు నర్సింగ్ సిబ్బంది, మరొక వంద మందికి పైగా బోధనేతర సిబ్బంది సేవలు అందిస్తున్నారు.

మూడు నూతన కోర్సులు

సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో భాగంగా నూతనంగా సైక్రియాటిక్ నర్సింగ్, సైక్రియాట్రిక్ సోషల్ వర్క్, సైక్రియాటిక్ సైకాలజీ కోర్సులు ప్రారంభించనున్నారు. ఒక్కో కోర్సులో 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. వీరి బోధనతో పాటు ప్రత్యక్ష శిక్షణ అందిస్తారు. దీనితో సుశిక్షితులైన నిపుణులను ఈ రంగానికి తీర్చిదిద్ది అందించడం సాధ్యపడుతుంది.

వ్యసన విముక్తి కేంద్రం

మద్యానికి, మత్తు పదార్థాలకు బానిసలై ఇబ్బంది పడుతున్న వారికి ఉపశమనం కలిగించే విధంగా వ్యసన విముక్త కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. చికిత్స అవసరమైన వారిని ఇన్‌పేషెంట్‌గా చేర్చుకుని.. చికిత్స అందించి, సాధారణ వ్యక్తులుగా మార్చి పంపిస్తారు. అదే విధంగా మానసిక సమస్యల నుంచి చికిత్స పొందిన వారికి పునరావాసం కల్పిస్తూ కొత్త జీవితం ప్రారంభించే దిశగా అవసరమైన శిక్షణ అందించే కేంద్రం ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులో అన్ని విభాగాలు

మానసిక రోగులకు అవసరమైన థెరపీ, ట్రీట్‌మెంట్ విభాగాలు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయి. నిత్యం ఆస్పత్రికి 20 నుంచి 30 మంది కొత్త రోగులు వస్తున్నారు. ఆరోగ్య పరీక్షలు చేయించుకునేందుకు పాత రోగులు రోజుకు దాదాపు 250 నుంచి 300 మంది వస్తారు. మానసిక చికిత్సలో భాగంగా మందులు వాడుతూ నిత్యం మెడిసిన్ తీసుకోవడానికి వచ్చేవారు 500 మంది వరకు ఉంటారు.

పెరిగిన పీజీ సీట్లు

గతంలో కేవలం 17 పీజీ సీట్లు మాత్రమే ఉండేవి. ఆసుపత్రి వసతులు, బోధన సిబ్బంది సంఖ్య పెరగడంతో ప్రస్తుతం పీజీ సీట్ల సంఖ్య 27కి చేరింది. మరో 3 సీట్లు పెరిగే విధంగా ప్రస్తుతం బోధన సిబ్బందితో ఆస్పత్రి పరిపుష్టి సాధించింది.

ఎన్‌ఏబీహెచ్ గుర్తింపు

ఆస్పత్రుల్లో పరిశుభ్రత, మౌలిక వసతులు, వైద్య సిబ్బంది, ఆస్పత్రి అందించే సేవలు వంటివి ప్రత్యక్షంగా పరిశీలించి జాతీయ స్థాయిలో అందించే ఎన్ఏబీహెచ్ గుర్తింపును ప్రభుత్వ మానసిక ఆసుపత్రి సాధించడం విశేషం.



సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ

సంరక్షణ.. వసతులు

ఆస్పత్రికి ఆరోగ్య శ్రీ ఇన్సెంటివ్ ఉంది. వీటితో ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నారు. ఆస్పత్రిలో దీర్ఘకాలంగా నిరుపయోగంగా ఉన్న అంబులెన్స్‌ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చారు. రోగులకు ప్రత్యేకంగా వార్డుల్లో టీవీలు, వార్తాపత్రికలు వంటివి సమకూరుస్తున్నారు. ఆస్పత్రిలో మొత్తం 58 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. రోగులకు నాణ్యమైన భోజనాన్ని ఆస్పత్రి కిచెన్‌లోనే వండి అందిస్తున్నారు. జన్యుపరమైన కారణాలతో మానసిక సమస్యలు వచ్చే అవకాశాలను అధ్యయనం చేయడానికి త్వరలో రూ 3.5 కోట్లు విలువైన పరికరాలు రానున్నాయి. పారదర్శకత పెంచుతూ, సత్వర సేవలు అందించడంలో భాగంగా ఈ-హాస్పిటల్, ఈ- ఫార్మసీ సేవలు వినియోగంలోకి వచ్చాయి. మానసిక రోగుల సమస్యలను తెలుసుకుని కౌన్సెలింగ్ ఇచ్చేలా టెలి మానస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.



వార్డులో చికిత్స పొందుతున్న రోగులు



చిన్నారులకు చికిత్స అందించే కేంద్రం

స్నేహపూర్వక సేవలు



ఆస్పత్రికి వచ్చామనే భావన లేకుండా, ఆహ్లాదకర వాతావరణంలో సేవలు అందిస్తున్నాం. వైద్యులు, సిబ్బంది రోగులతో స్నేహపూర్వకంగా ఉంటారు. వారికి సత్వర స్వస్థత అందించి, సాధారణ జీవనం సాగించేలా చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వ సహకారంతో సమర్థవంతంగా సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ కె.వి.రామిరెడ్డి, సూపరింటెండెంట్

బాగా చూస్తున్నారు



నా భర్తకు అనారోగ్యంగా ఉండటంతో చికిత్స కోసం తీసుకువచ్చాను. పదిహేను రోజులుగా వార్డులో ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్యం మెరుగుపడింది. వైద్యులు నిత్యం పరీక్షిస్తున్నారు. అవసరమైన మందులు అందించారు. మంచి భోజనం పెడుతున్నారు. ఆసుపత్రిలో సేవలు చాలా బాగున్నాయి.

– డి.మంగ, రోగి సహాయకురాలు, తుని

క్లుప్తంగా

విద్యార్థుల చదువుకు రూ.25 వేల సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఎంవీపీ కాలనీ: ఇద్దరు పేద విద్యార్థుల చదువు కోసం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆర్థిక సాయం అందజేశారు. ఎంవీపీ కాలనీ పరిధిలోని 18వ వార్డు సెక్టార్ – 9లోని ఉమ్మిడి హారిక పిల్లలకు ఈ సాయాన్ని అందజేశారు. లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ముఖ్య నాయకుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. హారిక భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పిల్లలను చదవించడం కష్టంగా మారింది. ఈ విషయంలో పార్టీ స్థానిక నాయకుల ద్వారా ఎంపీకి తెలియడంతో పిల్లల చదువు నిమిత్తం హారికకు రూ.25 వేలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ కోసం కష్టపడి పనిచేస్తా



సత్తి మందారెడ్డి

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీలో పన్నెండేళ్లుగా సేవలు అందించినందుకు గుర్తించి పార్టీ అధిష్టానం తనను విశాఖ జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా నియమించిందని సత్తి మందారెడ్డి శుక్రవారం ఆరిలోవలో విలేకరులకు తెలిపారు. 12వ వార్డుకు చెందిన తనను విశాఖ జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్‌గా అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటివ్ మధుసూదనరెడ్డి ఈ నెల 1న ఉత్తర్వులు జారీచేసి, నియామక పత్రం ఇచ్చినట్లు తెలిపారు. పార్టీకి తాను చేసిన సేవలను అధిష్ఠానం గుర్తించి, తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. తాను మరింత బాధ్యతగా పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషి చేసిన వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, తదితరులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం



విద్యార్థికి నగదు అందజేస్తున్న రోటరీ సభ్యులు

ఏయూ క్యాంపస్: స్థానిక కేడీఎంపీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సాయిరాంకి రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని రోటరీ క్లబ్ విశాఖ స్మార్ట్ సిటీ, పూర్వ విద్యార్థులు అందజేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ సమక్షంలో శుక్రవారం సాయం అందించారు. లక్నో నగరంలో జరిగే జాతీయ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో సాయిరాం పాల్గొంటున్నారు. ప్రయాణ ఖర్చులకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని క్లబ్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వేణు, కార్యదర్శి రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమతీ భాయి, క్రీడా ఉపాధ్యాయురాలు రత్నం, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు నాగేంద్ర, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సంకల్ప యాత్ర ప్రచారం

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార కార్యక్రమం ఈఈసీ ప్రచార రథం ద్వారా 40 రోజుల పాటు నిర్వహించనున్నామని, దీనిలో భాగంగా తొలి విడత ఈ నెల 9 నుంచి 14 రోజుల పాటు ప్రచారం ఉంటుందని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ పథకాల కింద అర్హులైనప్పటికీ ఇప్పటి వరకు ప్రయోజనం పొందని వారికి సహాయం అందడం, పథకాలపై అవగాహన కల్పించడం, సమాచార వ్యాప్తి, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో వ్యక్తిగత అనుభవాలు పంచుకోవడం సంకల్పయాత్ర ఉద్దేశమన్నారు. జీవీఎంసీ పరిధిలో 8 జోన్లలో 40 రోజుల పాటు ఈ కార్యక్రమం జరగనుందని కమిషనర్ తెలిపారు.

అర్హులకు పారదర్శకంగా పథకాలు



జీవీఎంసీ 22వ వార్డులో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



జీవీఎంసీ 28వ వార్డులో సంక్షేమ పథకాల ఫ్లెక్సీ వద్ద ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, నాయకులు

బీచ్‌రోడ్డు: అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ పట్టం కట్టాలని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 22వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు – నేడు కార్యక్రమం ద్వారా వచ్చిన మార్పులను గమనించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు..

పారదర్శకంగా సంక్షేమ పథకాలు : రాష్ట్రవ్యాప్తంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 28వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో పథకాల బోర్డు, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో 17వ స్థానంలో ఉన్న విద్యా రంగం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో 3వ స్థానంలో ఉందన్నారు. అవినీతి లేని పాలన సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. అటువంటి సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, పాల్గొన్నారు.

ప్రతిభతోనే సమాజంలో గుర్తింపు



ల్యాబ్ టెక్నీషియన్‌ను అభినందిస్తున్న తులసి

మద్దిలపాలెం : ప్రతిభతో ఇష్టమైన రంగంలో రాణిస్తే తగిన గుర్తింపు లభిస్తుందని, దానికి కృషి, పట్టుదల ఎంతో అవసరమని జిల్లా మలేరియా నివారణ విభాగం అధికారి టి.తులసి అన్నారు. జిల్లా మలేరియా నివారణ విభాగం కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న చెల్లుబోయిన నాగేశ్వరరావు వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తులసి కార్యాలయంలో శుక్రవారం నాగేశ్వరరావును అభినందించారు. సబ్ యూనిట్ అధికారులు వెంకటేష్, నాగ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

12 నుంచి 'రసజ్ఞ' నాటకోత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకట కుమారి

మద్దిలపాలెం: రసజ్ఞ 8వ జాతీయ నాటకోత్సవాలను ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నామని నాటకోత్సవాల డైరెక్టర్ డాక్టర్ వేమలి త్రినాథరావు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను మేయర్ గొలగాని హరి వెంకటకుమారి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా త్రినాథరావు మాట్లాడుతూ ఈ ఏడాది నాటకోత్సవాల్లో నాలుగు రోజులు ప్రయోగాత్మక నాటక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ , ఉత్తర భారత సాంస్కృతిక మండలి ప్రయోగరాజ్ సౌజన్యంలో రసజ్ఞ సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో నాటకోత్సవాలు జరగనున్నాయన్నారు. ఈ నెల 12న డాక్టర్ వేమలి త్రినాథరావు, డి.హేమ వెంకటేశ్వర దర్శకత్వంలో గారడి నాటకం, షేక్ జాన్ బషీర్ దర్శకత్వంలో న్యూ బొంబే టైలర్ నాటకాన్ని ప్రదర్శించనున్నామని తెలియజేశారు.

హాస్టల్ మెస్ తనిఖీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థుల హాస్టల్ మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత ప్రత్యక్షంగా పరిశీలించారు. మెస్‌లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం తయారీ, సరఫరా వ్యవస్థలను పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కె.నాగేశ్వరరావు, ఆచార్య జి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కోసం ప్రణాళికలు

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.నవ్య అన్నారు. నైపుణ్యాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ప్రణాళికలను ఆమె మీడియాకు శుక్రవారం వివరించారు. రాష్ట్రంలోని నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలను అప్‌గ్రేడ్ చేసేందుకు ఆంధ్రప్రదేశ్ పయనీర్స్ యూనిక్ ఇండస్ట్రీతో ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. ఈ ఒప్పందంతో శ్రామిక శక్తిని డిమాండ్‌కు తగ్గట్టు తీర్చిదిద్దుకోవచ్చన్నారు. సరికొత్త సాంకేతిక పురోగతికి అనుగుణంగా ప్రభుత్వ కాలేజీలు, శిక్షణ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఆధునికీకరిస్తున్నామన్నారు. పరిశ్రమ ప్రమాణాలకు అనుగుణంగా కోర్సు కంటెంట్‌ను మెరుగుపరచడం, డిమాండ్‌కు తగ్గ కోర్సులు రూపొందించడం చేస్తున్నామని తెలిపారు.

యూజీడీ సమస్యకు పరిష్కారం

ఏయూ క్యాంపస్: వర్షాల కారణంగా జీవీఎంసీ 20వ వార్డు పరిధిలో పలుచోట్ల యూజీడీ వ్యవస్థలో ఇబ్బందులు తలెత్తాయి. చిన్నపోలమ్మ గుడి దిగువన, శివాజీపాలెంలో యూజీడీ బ్లాక్ అయింది. ఈ క్రమంలో ప్రత్యేకంగా మూడు యంత్రాలు తీసుకొచ్చి, ఆరుగురు సిబ్బంది రోజంతా శ్రమించి వీటిని సరిచేశారు. అడ్డుగా ఉన్న వ్యర్థాలు తొలగించారు. సమస్య తెలుసుకున్న వెంటనే కార్పొరేటర్ ముమ్మల లక్ష్మి పని జరుగుతున్న ప్రాంతానికి వచ్చి పరిశీలించారు. మరోవైపు పెదవాల్తేరు మునసబు వీధి కాలువలో వ్యర్థాలను స్థానిక వలంటీర్ యనమరెడ్డి కుమార్ రెడ్డి తొలగించారు. సిబ్బంది వచ్చే వరకూ నిరీక్షించకుండా కాలువ శుభ్రం చేసిన కుమార్‌రెడ్డిని కార్పొరేటర్ ముమ్మల లక్ష్మి అభినందించారు.

యోగా టీచర్ కోర్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పూర్వ వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: యోగభారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే యోగా సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించిన పోస్టర్‌ని ఏయూ పూర్వ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో యోగ భారతి ట్రస్ట్ చైర్మన్ పైడం నాయుడు, డాక్టర్ షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ యోగ భారతి ట్రస్ట్‌ని యోగా ట్రైనింగ్ సెంటర్‌గా గుర్తించింది. ఇందులో యోగ టీచర్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ పైడం నాయుడు తెలిపారు. దరఖాస్తుల కోసం 8309336658 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సీఎం జగన్ పాలనలో పేదల అభ్యున్నతి



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి



మాట్లాడుతున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: పేద ప్రజల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 11వ వార్డు 20వ నంబరు సచివాలయం పరిధి కైలాసనగర్‌లో శుక్రవారం నిర్వహించారు. ముందుగా వైఎస్సార్‌సీపీ జెండా, సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలతోపాటు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. వార్డులో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

- 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని జీవీఎంసీ 12వ వార్డులో శుక్రవారం నిర్వహించారు. ముందుగా కార్పొరేటర్ అక్కరమాని రోహిణి వైఎస్సార్ సీపీ జెండా, సంక్షేమ పథకాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ద్వారా పేద ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరుతుందో వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైల్డ్ లైఫ్ వార్డెన్ సత్తి మందారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కన్నేటి సుబ్బారెడ్డి, హుస్సేన్, సూర్యారావు, వరహాలు, మొల్లి రమణ, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

మార్మోగిన గోవింద నామస్మరణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలిసారిగా నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేశారు.

అదేవిధంగా శనివారం పవిత్ర సమర్పణ నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో జగన్మోహనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు వేలాది మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. గోవిందా గోవిందా అంటూ శ్రీవారి నామంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.